క్లుప్తంగా

ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపు

అర్వపల్లి: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలై కోడ్ అమలులోకి రావడంతో సోమవారం అధికారుల ఆదేశాల మేరకు అర్వపల్లిలోని రెండు హైవేలపై స్తంభాలకు, రోడ్ల వెంట ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకు ఎలాంటి ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు, ఏర్పాటు చేయవద్దని ఎంపీడీఓ కతురోజు ఉమేష్ సూచించారు.

వడ్డెరుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్

అర్వపల్లి: వడ్డెరుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో వడ్డెరులకు కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కందుల దశరథ రామారావు, తండ లింగమూర్తి, బూర్గుల రాంబాబు, జీడి మహేష్, ఉపేందర్, లింగయ్య, బొడ్డు వెంకన్న, లక్ష్మణ్, నర్సయ్య, కొండల్, వడ్డెర సంఘం నాయకులు గోగుల ఇద్దయ్య, భిక్షం, పెదరాములు, చినరాములు, కృష్ణ, విజయ్, నాగరాజు, వెంకన్న, మల్లయ్య, వెంకటేష్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ భవనాల పేరుతో మాయాజాలం

భానుపురి (సూర్యాపేట): వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసమే మంత్రి జగదీష్‌రెడ్డి సూర్యాపేట పరిధిలో ఉన్న గుట్టల స్థలాల్లో సంక్షేమ భవనాలు నిర్మాణానికి శంకుస్థాపనలతో మాయాజాలం చేస్తున్నారని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు గట్ల రమాశంకర్, జిల్లా అధ్యక్షులు మాంద్ర మల్లయ్య యాదవ్, యువ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్ కుమార్, జిల్లా కన్వీనర్ కుంచం చంద్రకాంత్, కో కన్వీనర్ వీరేష్ నాయక్, విద్యార్థి జన సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.


నాగారం ఎస్ఐగా సైదులుగౌడ్

నాగారం: నాగారం మండల నూతన ఎస్ఐగా ఎర్ర సైదులుగౌడ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నాగారం ఎస్ఐగా పనిచేస్తున్న జి.ముత్తయ్య బదిలీపై వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో సూర్యాపేట టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎర్ర సైదులుగౌడ్ నియమితులయ్యారు. అనంతరం సైదులుగౌడ్‌కు నాగారం పోలీస్‌స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రికి రుణపడి ఉంటాం

సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలో చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగించే తమకు దళిత బంధు మంజూరు చేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని దళిత బంధు లబ్ధిదారులు తెలిపారు. సోమవారం పట్టణంలోని 34 వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఒక్కసారి కలిసి తమ సమస్యను విన్నవించడంతో వెంటనే 30 మందికిపైగా దళిత బంధును అందించారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వల్దాసు ఉపేందర్, శ్రీనివాస్, నాగయ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

దోమలను నివారించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ఉపేంద్ర

మద్దిరాల: గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని మద్దిరాల ఎంపీపీ గుడ్ల ఉపేంద్రవెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా పనిచేసి గ్రామాల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సరోజ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీఓ రాజేష్,సర్పంచ్ లౌవుడ్యా వెంకన్న, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాగారం: మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన గణపురం పాపమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌కు తెలియంతో సోమవారం ఆయన పంపించిన రూ.10వేలను గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ యారాల రాంరెడ్డి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఈదుల కిరణ్‌కుమార్, సర్పంచ్ బోయిని శోభలింగమల్లు, ఎంపీటీసీ వడ్డే పరశురాములు, ఈరేటి అంజయ్య, బండగొర్ల యల్లయ్య, యాదగిరి, శేఖర్, మల్లేష్, లింగయ్య, రవి పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం


చివ్వెంల : ఐలాపురం శివారులో మున్నూరు కాపు భవన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బడుగుల

● ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట/సూర్యాపేట టౌన్/ చివ్వెంల/భానుపురి: అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఐలాపురం ఆవాసం గుర్రపుతండాలో మున్నూరు కాపు, ఐలాపురం వద్ద కమ్మ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి రమేష్, సూర్యాపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిశోర్, పబ్లిక్ క్లబ్ సెక్రటరీ పెద్దిరెడ్డి గణేష్, కృష్ణమూర్తి, గాలి శ్రీనివాస్, పిట్టల వెంకటేశ్వర్లు, మాదంశెట్టి వీరన్న, మానేపల్లి లక్ష్మయ్య, గట్టు అశోక్, రాధాకృష్ణ, కొల్లు మధుసూదన్ రావు, పున్నమి సత్యనారాయణ, వెంకటేశ్వర రావు, నరేంద్ర కుమార్, శంకర్ ప్రసాద్, చలసాని శ్రీనివాసరావు, వేములపల్లి అశోక్, హరిబాబు, వాసుదేవరావు, వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే సూర్యాపేట మండలం కేసారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 5లో 9గుంటల స్థలంలో చేపట్టిన తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్స్ ఫెడరేషన్ భవన నిర్మాణానికి సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తోట శ్రవణ్ కుమార్, షేక్ నబీ, పట్టణ అధ్యక్షుడు షేక్ మహిమూద్ అలీ, బరిశెట్టి సోమయ్య, బరిశెట్టి శ్రీనివాస్, మధు, సత్యనారాయణ, రమేష్, జానకి రాములు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కుడకుడలో సూర్యాపేట పట్టణ ప్రైవేట్ పాఠశాలల సంఘం(ట్రస్మా) భవన నిర్మాణానికి సోమవారం బీఆర్ఎస్ నేత గుర్రం సత్యనారాయణ రెడ్డి శంకుస్థాపన చేశారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఆత్మకూర్ (ఎస్): గ్రామాల్లో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూనే మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతమిస్తుందని ఎంపీపీ మర్ల స్వర్ణలతా చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ.5 కోట్లతో కస్తూరిబాగాంధీ పాఠశాలలో అదనపు తరగతి గదులు, రూ.15 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. అలాగే రూ.13 లక్షలతో చెన్నకేశవ స్వామి ప్రహరి గోడ, కోనేరు పూడికతీత, రూ.25 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, రూ.10 లక్షలతో ఆత్మకూరు ఎస్ నుంచి ఇస్తాళపురం వరకు ఫార్మేషన్ రోడ్డుకు ఆమె శంకుస్థాపన చేశారు.

తుంగతుర్తి నియోజకవర్గంలో శంకుస్థాపనలు

తిరుమలగిరి (తుంగతుర్తి): తుంగతుర్తి నియోజకవర్గంలో సోమవారం తుంగతుర్తి మండలం తూర్పుగూడెంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ రూ.4 లక్షలతో నిర్మించిన బతుకమ్మ ఘాట్‌ను, రూ.5 లక్షలతో సీసీ డ్రైనేజీలు, రూ.25 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాలల్లో అదనపు తరగతి గదులు ప్రారంభించారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి


మాట్లాడుతున్న ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: గ్రామాల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని సూర్యాపేట ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం కోరారు. సోమవారం సూర్యాపేటలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు 3 నెలల మండల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. నివేదికలో తప్పులు ఉండడంతో వివిధ శాఖల అధికారులపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలెంల సర్పంచ్ రామసాని రమేష్‌నాయుడు, ఎంపీటీసీ బాలాజీ పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇటీవల సూర్యాపేటలో ప్రకటించిన ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 10లక్షల చొప్పున 23గ్రామ పంచాయతీలకు రూ. 2కోట్ల 30లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌నాయుడు, ఎంపీఓ పరాంకుశరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అన్ని కులాలకు సమన్యాయం

బీఆర్ఎస్ పాలనలో అన్ని కులాలకు సమన్యాయం లభిస్తుందని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. సోమవారం మండల పరిధిలోని కేసారం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, బతుకమ్మ ఘాట్‌కు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, సర్పంచ్ నాగయ్య, వంగాల శ్రీనివాస్‌రెడ్డి, ముదిరెడ్డి సంతోష్‌రెడ్డి, గన్నారెడ్డి, ఆచారి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ భూరెడ్డి కళావతి

నూతనకల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషిచేయాలని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సమావేశాన్ని అర్ధంతరంగా ముగించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, ఎంపీడీఓ ఇందిరా, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


మండల పరిధిలోని తాళ్లసింగారం, చిల్పకుంట్ల గ్రామంల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డిలు సోమవారం శంకుస్థాపన చేశారు. తాళ్లసింగారంలో గ్రామ పంచాయతీ భవనం, చిలపకుంట్లలో సీసీ రోడ్డు, వీధిలైట్ల పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇందిరా, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, సర్పంచ్‌లు కొంపెల్లి రాంరెడ్డి, చూడి లింగారెడ్డి, జక్కి పరమేష్, తాడూరి లింగయ్య, బిక్కి బుచ్చయ్య, పులుసు లింగమల్లయ్య, బాణాల సత్యనారాయణరెడ్డి, పన్నాల సైదిరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): డబుల్ బెడ్‌రూం ఇళ్ల డ్రా పారదర్శకంగా తీయలేదని, తక్షణమే లబ్ధిదారుల జాబితాను రద్దు చేసి అన్ని పార్టీలు, మీడియా సమక్షంలో డ్రా తీసి అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సూర్యాపేటలో తొమ్మిదేళ్ల అనంతరం అరకొరగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేశారని మండిపడ్డారు. 384 ఇళ్ల నిర్మాణం పూర్తయితే 864 ఇళ్లకు డ్రా తీయడం ప్రజలను మభ్యపెట్టడానికేనని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు అబీద్, చలమల్ల నరసింహ, కర్నాటి కిషన్, ధనుంజయ్‌గౌడ్, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలందరికీ పథకాలు అందించాలి


మాట్లాడుతున్న బుర్ర శ్రీనివాస్

తుంగతుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బుర్ర శ్రీనివాస్ అన్నారు. సోమవారం తుంగతుర్తిలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దళిత, బీసీబంధు, గృహలక్ష్మి పథకాలు కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకే అందిస్తుండడంతో అర్హులైన వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రభుత్వం తుంగతుర్తిలో ఇటీవల వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేసిందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కందాల శంకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తాటి విజయమ్మ, మల్లయ్య, యాదగిరి, వెంకన్న, గణేష్ పాల్గొన్నారు.

అనర్హులకు ఇళ్లు కేటాయించడం సరికాదు

నాగారం: అనర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించడం సరికాదని మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు దరఖాస్తుదారులు అన్నారు. సోమవారం డి.కొత్తపల్లి గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో 75 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి అనర్హులకు కేటాయించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దరఖాస్తుదారులు దొపటి అనిల్, వంగూరి చంద్రశేఖర్, దేవరకొండ ఉపేందర్, హరిబాబు, పడిశాల పరుశరాములు, మల్లేష్, రమేష్, దేవరకొండ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ప్రజలను వంచించేందుకు యత్నం


మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రాజా

భానుపురి (సూర్యాపేట): రోజురోజుకు బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ట దిగజారిపోవడంతో అమలుకు సాధ్యం కాని హామీలు, హడావుడి శంకుస్థాపనలతో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మరోసారి ప్రజలను వంచించే యత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెద్దిరెడ్డి రాజా అన్నారు. సోమవారం సూర్యాపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓటమి భయంతోనే అసంతృప్తిగా ఉన్న వర్గాలను సంతృప్తి పర్చే కార్యక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు శనగాని రాంబాబు, నేరేళ్ల మధు, దున్నా బాబు, సూరాయ్య, గునగంటి మధు, గోపగాని గిరి, రాచకొండ దేవయ్య, వేణు, తండు రమేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి

సూర్యాపేట టౌన్: నల్లగొండలో ఈ నెల 11న జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బెల్లి నాగరాజు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు హరీష్, సురేష్, ప్రకాష్, చందు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్ట్


నాగారంలో అరెస్టయిన ఆశా వర్కర్లు

నాగారం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ పిలుపు మేరకు సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా వర్కర్లను నాగారంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఆశ కార్యకర్తలు నాతి జయమ్మ, యానాల విజయలక్ష్మి, ఎమిలియ, ఇందిరా, సంధ్య, జానకమ్మ, మట్టమ్మ, చిలుకమ్మ, శైలజ, ఉమ, రోజా, నాగమణి, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

అర్వపల్లి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం అర్వపల్లిలో నిరసన తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో జరిగిన ఆందోళన కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పగిడిమర్రి పద్మ, ఎస్.జ్ఞానసుందరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

తుంగతుర్తి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డుపై ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆశకార్యకర్తలు రమ, జయమ్మ, కొమరమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మరమ్మతులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..


ఆత్మకూర్‌లో బీటీ రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఆత్మకూర్ (ఎస్): మండల కేంద్రంలోని భీమునికుంట అలుగు నుంచి ఆత్మకూర్ ఎక్స్‌రోడ్డు వరకు రూ.26.80లక్షల వ్యయంతో తలపెట్టిన బీటీ రోడ్డు మరమ్మతు పనులను సోమవారం అధికారులతో కలిసి ఎంపీపీ మర్ల స్వర్ణలతా చంద్రారెడ్డి ప్రారంభించారు. చాలాకాలంగా ఈ రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంతో గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సాక్షి దినపత్రిక ఇటీవల 'ప్రయాణం.. నరకప్రాయం' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు మరమ్మతుల కోసం రూ.26.80 లక్షలను మంజూరు చేయడంతో పాటు పనులు ప్రారంభించారు.

పేదల పక్షపాతి సీఎం కేసీఆర్


తిరుమలగిరి : చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

తిరుమలగిరి (తుంగతుర్తి): సీఎం కేసీఆర్ పేదల పక్షపాతిగా పని చేస్తున్నారని, ప్రతి బతుకమ్మ పండుగకు మహిళలకు చీరలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత అన్నారు. సోమవారం బండ్లపల్లి, కన్నారెడ్డికుంట గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు జమ్మిలాల్, గ్రామ సర్పంచ్ సోమలక్ష్మి, కన్నారెడ్డి కుంట తండా సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: బండరామారంలో సోమవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మడ్డి నాగలక్ష్మికృష్ణమూర్తి, ఉపసర్పంచ్ ఇందిరాఉప్పలయ్య, కార్యదర్శి వెంకటలక్ష్మి ఉన్నారు.

ఇళ్లస్థలాలు కేటాయించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఇళ్లు కోల్పోయిన తమకు తగిన నష్ట పరిహారం అందించాలని పులిచింతల ప్రాజెక్టు ముంపు బాధితులు అబ్బిరెడ్డి పార్వతమ్మ, అన్నెపురెడ్డి విజయేందర్‌రెడ్డి, అన్నెపురెడ్డి కోటిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సూర్యాపేటలో కలెక్టర్ వెంకట్రావును కలిసి వినతిపత్రం అందించారు. భూములకు నష్ట పరిహారం ప్యాకేజీ అందినా ఇళ్లకు అందించలేదన్నారు. కోల్పోయిన ఇంటి స్థలం బదులుగా పునరావాస కేంద్రంలో మరో ఇంటిని కేటాయించాలని కోరారు.

కాన్షీరాంకు ఘన నివాళి


సూర్యాపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి(సూర్యాపేట)/అర్వపల్లి: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 17వ వర్ధంతి సందర్భంగా సోమవారం ధర్మ సమాజ పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని రైతు బజార్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, నాయకులు శ్రీనివాస్, బాలు, విజయరామరాజు, శ్రీనివాస్, సైదులు, నాగరాజు, వంశీ, అంబేడ్కర్, పరశురాములు, కరుణాకర్ పాల్గొన్నారు. అలాగే అర్వపల్లిలో కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చెర్కుపల్లి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీను, జీడి వెంకన్న, మల్లెపాక వెంకటేష్, ఉపాధ్యక్షురాలు కమటం శోభాబాయి, కార్యదర్శి కె.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం


తిరుమలగిరి : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్


అర్వపల్లి : ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కోడూరు వాసులు

● తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

తిరుమలగిరి/అర్వపల్లి: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. సోమవారం తిరుమలగిరిలోని క్యాంపు కార్యాలయంలో జాజిరెడ్డిగూడెం మండలం కోడూరుతోపాటు పలు గ్రామాలకు చెందిన పద్మశాలీలు, ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పొన్నం వెంకన్న, వెలిశాల ఎంపీటీసీ సభ్యురాలు పొన్నం సమత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, గంట యల్లయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు నిద్ర సంతోష్, దేశగాని శంకర్, ఎస్ఎంసీ చైర్మన్ తండ దశరథ, మల్యాల సందీప్, దేశగాని గణేష్, తోట సంతు, తండ వెంకన్న, దేశగాని మహేష్ పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి.. అంబేడ్కర్


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక

తుంగతుర్తి: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని తూర్పుగూడెం గ్రామంలో సాధన యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేందర్ రావుతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని గుర్తు చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని సీఎం కేసీఆర్ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సాధన యూత్‌క్లబ్ సభ్యులను అభినందించారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, సర్పంచ్ గుజ్జ పూలమ్మ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, తాటికొండ సీతయ్య, దొంగరి శ్రీను, యాదగిరి వెంకన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

భగవద్గీతపై ఇంటింటా ప్రచారం

నాగారం: త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథంపై సోమవారం మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వేదిక భువనగిరి, జనగాం, చేర్యాల, తొర్రూర్ కమిటీల అధ్యక్షులు దేవేందర్, శ్రీనాథ్‌శ్రేష్ట, పంచాక్షరి, సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి

చివ్వెంల: వికలాంగులకు పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని భారత వికలాంగ హక్కుల సాధన సమితి (బీవీహెచ్‌ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ సమితి ఆధ్వర్యంలో చివ్వెంల మండల పరిధిలోని గుంపుల గ్రామంలో రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కొల్లూరి ఈదయ్య, పేర్ల సోమయ్య, మున్న మధు, గోగుల శేఖర్‌రెడ్డి, గోపిరెడ్డి పాల్గొన్నారు.

రాములు మృతికి సంతాపం

మద్దిరాల: మండల కేంద్రానికి చెందిన పంచాయతీ ఎలక్ట్రీషియన్ గుర్వోజు రాములు అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. దీంతో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ఏ.రజాక్, సర్పంచ్ ఇంతియాజ్‌ఖాతూన్ రాములు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గూడ వెంకట్‌రెడ్డి, వద్దాణం మధుసూదన్, మల్యాల నర్సయ్య, నలమాస రాములు, రాంపాక నాగరాజు, పాక సోమలింగం, రాంపాక సతీష్, తేలుకుంట్ల సృష్టి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ

నాగారం: యువకులు క్రీడాసామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని నాగారంబంగ్లా సర్పంచ్ కుంభం కర్నాకర్ అన్నారు. సోమవారం గ్రామంలో క్రీడాప్రాంగణానికి ప్రభుత్వం నుంచి వచ్చిన క్రీడా సామగ్రిని యువకులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శోభన్ బాబు, వార్డు సభ్యులు, క్రీడాకారులు ఉన్నారు.

కొర్రమీను పెంపకం.. ఆశాజనకం



పక్కపక్కనే తవ్విన చెరువులు, వాటిల్లో పెరుగుతున్న చేపలు ఇవే..

- కుంచమర్తిలో నాటు కొర్రమీను చేపలు పెంచుతున్న రైతు శ్రీనివాస్
- రెండెకరాల విస్తీర్ణంలో రెండు చెరువుల తవ్వకం
- సబ్సిడీపై భీమవరం నుంచి 20వేల చేపపిల్లలు కొనుగోలు
- ప్రస్తుతం కిలో సైజులో పెరిగిన చేపలు

అర్వపల్లి: మండలంలో చేపట్టిన నాటు కొర్రమీను చేపపిల్లల పెంపకం ఆశాజనకంగా మారింది. జాజిరెడ్డిగూడెం మండలం కుంచమర్తి గ్రామ శివారులోని గుట్ట వెంట ఉన్న కేఆర్ఆర్ గొర్రెల ఫాంలో రైతు కంబాలపల్లి శ్రీనివాస్ కొర్రమీను చేపపిల్లల పెంపకం చేపట్టారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) ద్వారా సదరు రైతు నిర్వహిస్తున్న గొర్రెల ఫాం ఆవరణలోనే సుమారు రూ.20లక్షల వ్యయంతో రెండెకరాల విస్తీర్ణంలో రెండు చెరువులు తవ్వించాడు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎంఈజీఎఫ్ ద్వారా చేపల చెరువుకు 35శాతం సబ్సిడీ మంజూరు కావడంతో ఏపీ రాష్ట్రంలోని భీమవరం నుంచి 20వేల నాటు కొర్రమీను చేపపిల్లలను కొనుగోలు చేసి తెచ్చాడు. గతేడాది డిసెంబర్‌లో ఆ రెండు చెరువుల్లో చేపపిల్లలను పోసి పెంచుతున్నాడు. అయితే 20వేల చేపపిల్లల్లో సుమారు 3వేల పిల్లలు రోగాల బారిన పడి మరణించాయి. మిగిలిన 17వేల వరకు పిల్లలను పెంచుతున్నారు. ఒక్కో చేపపిల్ల ప్రస్తుతం అరకిలో నుంచి కిలో పైగా సైజులో పెరిగింది. ఈ రెండు చెరువుల్లో పోసిన చేపపిల్లలకు గ్రోవెల్ కంపెనీకి చెందిన నాణ్యమైన దాణాను అందిస్తున్నారు.

మరో నెల రోజుల్లో చేపలు అమ్ముతాం..



"నా గొర్రెల ఫాం ఆవరణలోనే దాదాపు రెండు ఎకరాల విస్తీర్ణంలో రెండు పెద్ద చేపల చెరువులను తవ్వించాను. ఇందులో నాటు కొర్రమీను చేపపిల్లలను పెంచుతున్నాను. ఎప్పటికప్పుడు చెరువుల్లో నీళ్ల తొలగించి కొత్త నీళ్ల పెడుతున్నాను. ప్రస్తుతం వీటి సైజు అరకిలో నుంచి కిలో వరకు ఉంది. మరో నెల రోజుల్లో కొర్రమీను చేపలను పట్టి అమ్మకాలు చేపడతాం.

– కంబాలపల్లి శ్రీనివాస్, రైతు, కుంచమర్తి